క్లుప్తంగా

మిర్యాలగూడ టూటౌన్ సీఐ బదిలీ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ టూటౌన్ సీఐ నిగిడాల సురేష్‌ను సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ సోమవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మిర్యాలగూడలో టూటౌన్‌లో ఆయన 19నెలల పాటు విధులు నిర్వర్తించారు. కాగా ఆయన స్థానంలో ఎవరిని సీఐగా నియమించేది తెలియరాలేదు.

పోల్కంపల్లి సర్పంచ్‌కు నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పోల్కంపల్లి సర్పంచ్ కదారి శ్రీనివాస్

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని పోల్కంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కదారి శ్రీనివాస్ బహుజన సాహిత్య అకాడమీ అందజేసే ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ చైర్మన్ నల్ల రాధకృష్ణ ఈ అవార్డును సర్పంచ్ కదారి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నల్ల రాధకృష్ణ, నల్లగొండ జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యుడు బుర్రి వెంకన్నకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

దేవరకొండ: నకిరేకల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున 9మంది విద్యార్థులు పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, కరాటే మాస్టర్ శ్రీను తెలిపారు. ఈ మేరకు సోమవారం దేవరకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎన్‌వీటీ అభినందించారు. కార్యక్రమంలో జగన్, మురళీకృష్ణ, ఆకాశ్, బాలు, రాములుగౌడ్ తదితరులున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మిర్యాలగూడ: హైదరాబాద్‌లో మార్చి 4న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులు డాక్టర్ జె.రాజు, కొండేటి వెంకట్, కత్తుల సూర్యనారాయణ సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభలకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ జేబీ రాజు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె.రాములు, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజు తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో గుడపూరి శ్రీనివాస్, కోడిరెక్క శౌరి, మంద శ్రీనివాస్, కెందాల మారయ్య పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధితుల ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: పొదుపు సంఘాల పేరిట మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బాధితులు ఆర్డీఓ చెన్నయ్య, డీఎస్పీ వెంకటగిరికి వినతిపత్రాలు అందజేశారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 3500 మంది గతంలో స్నేహ పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘాల సమాఖ్యలో నెలకు రూ.100 చొప్పున పొదుపు చేశారన్నారు. తక్కువ పొదుపు చేసినప్పటికీ రెట్టింపు డబ్బు ఇస్తామని నమ్మబలికి సుమారు రూ.1.20కోట్ల వరకు వసూలు చేసినట్లు గతంలో పోలీసులు నిర్ధారించారన్నారు. అప్పట్లో సంస్థ నిర్వాహకులు కృష్ణవేణితో పాటు శంకర్, వేణుగోపాల్, నరేష్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేశారని, డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి ఆరు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. డబ్బుల ఆశ చూపి మోసం చేసిన వారిని అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పోలెబోయిన వరలక్ష్మి, చెనగని యాదగిరి, దైద భిక్షం, బాధితులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత

మిర్యాలగూడ అర్బన్: భవిత కేంద్రం ద్వారా మంజూరైన ట్రైసైకిల్‌ను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ధనావత్ మునికి ఎంఈఓ ఎం. బాలాజీ నాయక్, హెచ్‌ఎం నర్సిరెడ్డి సోమవారం పాఠశాలలో అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్ర కృష్ణనాయక్, బ్రహ్మచారి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

దర్జీల బతుకులు దుర్భరం

- రెడీమేడ్ దుస్తులతో ఉపాధి కోల్పోతున్న టైలర్లు
- టైలరింగ్ వృత్తిని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- నేడు ప్రపంచ టైలర్స్ డే



త్రిపురారంలో ఓ టైలర్ షాపులో దుస్తులు కుడుతున్న దర్జీలు

త్రిపురారం: ఒకప్పుడు సమాజంలో దర్జాగా బతికిన దర్జీలు ప్రస్తుతం సరైన ఉపాధి లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారు. గతంలో ప్రజలు దర్జీల వద్దకు వెళ్లి తమకు నచ్చినట్లు దుస్తులు కుట్టించుకునేవారు. ప్రస్తుతం రోజురోజుకు మారుతున్న కాలానికి అనుగుణంగా రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లోకి రావడంతో దర్జీల వద్ద దుస్తులు కుట్టించుకునేవారే కరువయ్యారు. వస్త్ర ప్రపంచంలో, ఫ్యాషన్ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు దర్జీల జీవితాలను అతలాకుతలం చేశాయి. టైలర్ షాపులో డ్రెస్సు కుట్టించుకుంటే రూ.350 వరకు తీసుకుంటున్నారు. అదే ధరకు రెడీమేడ్ షాపులో కొత్తకొత్త డిజైన్లతో డ్రెస్సులు వస్తుడడంతో వినియోగదారుడు రెడీమేడ్ షాపుల వైపే ఆసక్తి చూపుతున్నాడు. టైలరింగ్ వృత్తిపై ఆధారపడి త్రిపురారం మండలం వ్యాప్తంగా దాదాపు 300 కుటుంబాలు జీవిస్తున్నాయి. నూతన పోకడలకు అనుగుణంగా మార్కెట్లలోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో వాటికి ఎదురొడ్డి మనుగడ సాధించడం దర్జీలకు కత్తిమీదసాములా మారింది. ఏళ్ల తరబడి టైలరింగ్ వృత్తినే నమ్ముకున్న కొందరు వేరే పని చేయలేక మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా చిన్న చిన్న షాపులు, బట్టల షాపుల ముందు మిషన్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం తమకు ఏదైనా సహాయం చేసి టైలరింగ్ వృత్తిని కాపాడాలని పలువురు దర్జీలు కోరుతున్నారు.

దర్జీల ప్రధాన డిమాండ్లు..

- వయస్సు పైబడిన వారికి పెన్షన్ ఇవ్వాలి.
- దర్జీల కుటుంబాలకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి.
- టైలర్లకు ఇంటి స్థలాలు అందజేయాలి.
- పావులా వడ్డీపై రుణాలు అందజేయాలి.

ప్రభుత్వం చేయూతనివ్వాలి



గత 40 ఏళ్లుగా నేను టైలర్‌గా పనిచేస్తున్నాను. గతంలో చేతినిండా పని దొరికేది. పండుగల సమయంలో ఒక్క నిమిషం కూడా ఖాళీగా ఉండకుండా రాత్రి, పగలు నిద్రాహారాలు మాని దుస్తులు కుట్టేవాళ్లం. అప్పట్లో టైలరింగ్ నేర్చుకునేందుకు ఎంతో మంది వచ్చేవారు. మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో సరైన ఉపాధి లేక కుటుంబ అవసరాలు పెరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. టైలరింగ్ చేసే వృత్తిదారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి.

– ధనుంజయ్, టైలర్, త్రిపురారం

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



దేవరకొండ: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. చందంపేట మండలం నక్కలగండి తండాకు చెందిన సుమారు 100మంది సోమవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య, దొండేటి మల్లారెడ్డి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, అర్జున్‌సింగ్, బొల్లు రామకృష్ణ, బొడ్డికూర మహాలక్ష్మయ్య, భరత్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చింతపల్లి: గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవాని, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రాజు, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జగదీశ్వర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లింగంపల్లి వెంకటయ్య, వివిధ శాఖల అధికారులు ఏఈ జీవన్‌సింగ్, విద్యుత్ ఏఈ మురళీకృష్ణ, ఎంఈఓ గురువారావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచేందుకే సైన్స్ ఫెయిర్‌లు..

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్‌లు ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మాల్ వెంకటేశ్వరనగర్‌లోని రెయిన్‌బో పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, ఎంపీపీ కొండూరు భవాని, డైరెక్టర్ ఖాజా నవాబు, ప్రిన్సిపాల్ వీరేశం, సర్పంచ్ కొండూరు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను కూలీలుగా మార్చిన కేసీఆర్



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నేనావత్ బాలూనాయక్

డిండి: రాష్ట్రంలో ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులను కూలీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నేనావత్ బాలూనాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వీరబోయనపల్లి ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెరవేర్చే హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ వ్యవస్థ మాత్రమే అభివృద్ధి చెందిదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయానికి 24గంటల కరెంట్ అందించడంలో, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో, రూ.లక్ష వరకు రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో దేవరకొండలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ అధికార ప్రతినిధి సిరాజ్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు లక్పతినాయక్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గిరీష్‌యాదవ్, హరికృష్ణ, భద్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయాలని వినతి

మిర్యాలగూడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి రూ.90వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదన్నారు. కార్యక్రమంలో బి. కనకయ్య, యర్రబోతు పద్మ, డి. శాంత, ధీరావత్ లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ర్యాగింగ్‌పై అవగాహన

హాలియా: ప్రీతిని మృతికి కారకుడైన సైఫ్‌తో పాటు అతనికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలే రవి, సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. దళిత సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బ్రిలియంట్ స్కూల్‌లో విద్యార్థులకు ర్యాగింగ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ప్రీతి కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆడపు శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులయ్యే బీఆర్‌ఎస్‌లోకి..

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



హాలియా: పార్టీలో చేరిన నాయకులతో కలిసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు ఇడుదుల నారాయణ, వైస్ చైర్మన్ మండాది నాగయ్య, బొజ్జ హుస్సేన్, రామయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాల రవి, సర్పంచ్ బిక్షానాయక్, ఎంపీటీసీ పెద్దమాము కాశయ్య, మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి తిరుమల్, సర్పంచ్‌లు జటావత్ దేవుడు, కిషన్‌నాయక్, శంకర్‌నాయక్, రామ్‌సింగ్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గుర్రంపోడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ. 14,45,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నోముల భగత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లారం సర్పంచ్ నర్సింహ, ఎంపీటీసీ చంద్రమౌళి, శేఖర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పూల సహదేవ్, కామర్ల రాములు తదితరులు ఉన్నారు.

గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే..

నిడమనూరు: మండలంలోని ముప్పారం గ్రామంలో సోమవారం గంగ దేవమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ జాతరకు ఎమ్మెల్యే నోముల భగత్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ బొల్లం జయమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, సర్పంచ్ శ్రీను, బొల్లం రవి, వెంకటరమణ, భాస్కరి నారాయణ, శ్రీనివాసరావు, గ్రామస్తులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలో ఆడబిడ్డలకు భద్రత కరువు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగం వర్షిత్‌రెడ్డి

గుర్రంపోడు: కేసీఆర్ పాలనలో తెలంగాణలో ఆడబిడ్డలకు భద్రత కరువయ్యిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొప్పోలు గ్రామంలో బీజేపీ గ్రామ శక్తి కేంద్రం కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ప్రవేశపెట్టి ఆడబిడ్డలకు అండగా ఉంటుందని అన్నారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోని సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు తేలుకుంట్ల రవికుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి చింతల మహేష్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి వినోద్, వార్డు సభ్యుడు బుషిపాక శంకర్, సింగం నరేష్, చింతరెడ్డి వినోద్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌లు స్థానికంగా ఉండాలి



పెద్దవూర ఎస్టీ హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏటీడీఓ వెంకటయ్య

పెద్దవూర: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పనిచేస్తున్న వార్డెన్‌లు స్థానికంగా ఉండాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి(ఏటీడీఓ) ఉడుతనూరి వెంకటయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్టీ రెగ్యులర్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, సమీకృత బాలికల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బందికి సంబంధించిన హాజరు పట్టికలు, రికార్డులను పరిశీలించారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలలోని మౌలిక వసతులను పరిశీలించి మాట్లాడారు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా హెచ్‌ఎంలు, వార్డెన్‌లు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు అరవై రోజుల ప్రత్యేక ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళ ట్యూటర్లచే విద్యాబోధన చేయాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం ధీరావత్ బాలోజీ, వసతి గృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, సంధ్యారాణి, ఉపాధ్యాయులు రాంరెడ్డి, షబ్బీర్, కృష్ణ, శ్రీను, సైదులు, రామయ్య, సంధ్య తదితరులు ఉన్నారు.

ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరం



సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్: ప్రతి విద్యార్థికి ప్రాక్టికల్ నాలెడ్జ్ చాలా అవసరమని డాక్టర్ వై. కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని శాస్త్ర హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను ఆయన సందర్శించి నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం డాక్టర్ కిరణ్‌కుమార్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి. శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డి. మోహన్‌కృష్ణ, సింధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



దేవరకొండ: ధర్నా చేస్తున్న వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు



మిర్యాలగూడ టౌన్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా మోర్చా నాయకులు



మిర్యాలగూడ: కొవ్వొత్తులు వెలిగిస్తున్న మినా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు



పెద్దవూర: ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ: వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో సీనియర్ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న వైద్య విద్యార్థి ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రీతి మృతికి కారణమైన నిందితుడు సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ వద్ద యువజన, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కొర్ర రాంసింగ్, శ్రీధర్‌నాయక్, నాగేశ్వర్‌నాయక్, లక్ష్మణ్, వంగూరి వెంకటేష్, మల్లేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం..

ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం డిండి చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్, హరీశ్, కళ్యాణ్ తదితరులున్నారు.

కొవ్వొత్తులు వెలిగించి సంతాపం

మిర్యాలగూడ: వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపంగా మిర్యాలగూడ పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎండీ మహమ్మద్ అలీ, కళాశాల డైరెక్టర్ షహాబుతుల్, ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, బడేసాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో విద్యాసంస్థల బంద్

మిర్యాలగూడ టౌన్: ప్రీతి మృతికి కారణమైన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యాసంస్థలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధనావత్ సిద్దునాయక్, ఉపాధ్యక్షుడు ధనావత్ చందునాయక్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్, నాయకులు పవన్‌నాయక్ తదితరులున్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

వైద్య విద్యార్థిని ప్రీతి, బీటెక్ విద్యార్థిని రక్షిత ఆత్మలకు శాంతి చేకూరాలని సోమవారం రాత్రి బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత, కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థినులతో కలిసి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండేటి సరిత మాట్లాడుతూ.. హన్మకొండలో పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ ప్రీతి కుటుంబ సభ్యులను పరామర్శించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, అసెంబ్లీ ప్రభారీ గోగినేని లచ్చిరెడ్డి, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు యాదమ్మ, రేణుక తదితరులున్నారు.

పెద్దవూరలో..

పెద్దవూర: ప్రీతి మృతికి సంతాపంగా బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రీతి చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, గిరిజన మోర్చా నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పాల్తీ శంకర్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెన్నం గంగా, ఏరుకొండ పద్మ, దేవ్‌సింగ్, శంకర్, జగన్, గుండాల దిల్‌రాజు, బుక్క వీరేశం, సుమన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వారబందీ ఎత్తివేయాలని మంత్రికి వినతి

హాలియా: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న వారబందీ విధానాన్ని ఎత్తివేసి నిరంతరం సాగునీటిని అందించాలని సోమవారం హాలియా మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి వచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డికి డీసీసీబీ డైరెక్టర్ వినిగినేని అంజయ్య వినతి పత్రం అందజేశారు. వారబందీ విధానంతో పొట్టదశలో ఉన్న పంట పొలాలకు నీరు సమృద్ధిగా అందడం లేదని, దీంతో పాటు వివిధ రకాల చీడపీలు పంటలకు వ్యాపించి రైతులకు తీరని నష్టం జరుతుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి జగదీశ్‌రెడ్డి ఈఈతో మాట్లాడి త్వరలోనే సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

క్షుద్ర పూజల కలకలం

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని సుందర్‌నగర్ కాలనీలో ఓ ఇంటి ముందు సోమవారం క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. కోడి ఈకలు, రక్తం మరకలు, నిమ్మకాయలు, కుంకుమ, పసుపును వేయడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

డిండి: మండల కేంద్రానికి చెందిన విబూది మన్యం అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే సహకారంతో రూ.లక్ష మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీని బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు గుర్రం సురేష్ సోమవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నిడమనూరు: మండలంలోని ముకుందాపురంలో సోమవారం బొడ్రాయి, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా గత మూడు రోజులుగా గ్రామంలో వివిధ రకాల పూజలు, హోమాలు, యాగం చేశారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పురోహితుడు గుదె లక్ష్మీనర్సయ్య, వేద పండితులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

అడవిదేవులపల్లి: మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో సర్వే నంబర్ 13లో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గువ్వల రామయ్య, కొండ వెంకటేశ్వర్లు, చంద్రయ్య, శివకృష్ణ, కొండ సీత రామయ్య తదితరులున్నారు.

పత్తి తూకంలో మోసం

మిర్యాలగూడ: తూకంలో తేడాలు రావడంతో పత్తి కొనుగోలు చేసే వ్యాపారిని రైతులు నిలదీసిన సంఘటన సోమవారం మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందుగుల గ్రామానికి చెందిన గుండెబోయిన శంకర్, గుండెబోయిన రామలింగం తాము పండించిన పత్తిని క్వింటాకు రూ.7300 చొప్పున వ్యాపారి చెవ్వగోని సోమయ్యకు అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు సోమవారం పత్తి కాంటా వేస్తుండగా తూకంలో తేడాలు ఉన్నట్లు గుర్తించిన రైతులు వ్యాపారిని నిలదీశారు. దీంతో సరైన ధర చెల్లిస్తానని రైతులకు వ్యాపారి హామీ ఇచ్చాడు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

హాలియా: అనుముల మండలంలోని చింతగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం ప్రధానోపాధ్యాయుడు అబ్బిరెడ్డి వేమారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ ప్రతినిధులు చిలకరాజు శ్రీనివాస్, మహేష్, రామకృష్ణ, టీచర్లు ఉన్నారు.

పెద్దవూర: మండలంలోని పెద్దవూర, చలకుర్తి, పెద్దగూడెం, వెల్మగూడెం, పులిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం మండల విద్యాధికారి లావూరి బాలునాయక్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కె. శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో మార్చి 1, 2, 3 తేదీల్లో జరిగే తెలంగాణ గిరిజన సంఘం 3వ రాష్ట్ర మహాసభల్లో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వేములపల్లి సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం వేములపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలకు ఆదివాసీ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకురాలు బృందాకారత్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎంపీ బాబురావుతో పాటు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మక్కాల లింగస్వామి, మల్లయ్య, పఠాని శ్రీను, బొమ్మగాని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓకు సమ్మె నోటీసు

మిర్యాలగూడ టౌన్: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1, 2, 3వ తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సమ్మెకు మద్దతుగా సోమవారం మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమతకు సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు మల్లు గౌతమ్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొందు పార్వతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, వేతనాలతో కూడిన మెడికల్ సెలవులను అమలు చేయాలని, 2017 నుంచి ఇంక్రిమెంట్, ఆన్‌చార్జీల అలవెన్స్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తూడి అరుణ, నాగమణి, ఝాన్సీ, స్వరాజ్యం, రజిత, ఆయాలు పాల్గొన్నారు.